క్లుప్తంగా

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

ఉయ్యాలవాడ : మండలంలోని ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ, సుద్దమల్ల, ఇంజేడు గ్రామాల్లో శనివారం ఆలయాలకు భక్తులు ఉదయాన్నే చేరుకుని పూజలు చేశారు. అభయాంజనేయస్వామి, శ్రీ లక్ష్మీనరసింహ కంబగిరి స్వామి, శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామికి అభిషేకాలు, ఆకుపూజ, కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు లక్ష్మణస్వామి, భాస్కరశర్మ, కమలేష్‌శర్మ, అనంతయ్య భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఇరుముడితో శబరిమలకు



ఇరుముడితో బయలుదేరిన అయ్యప్ప మాలధారులు

చాగలమర్రి: స్థానిక ఏకశిల పదునెట్టాంబడి అయ్యప్పస్వామి ఆలయం నుంచి శనివారం సుమారు 40 మంది అయ్యప్పస్వామి మాలధారులు మండల దీక్ష పూర్తి చేసి ఇరుముడితో శబరిమలకు బయలుదేరారు. ఆలయంలో గురుస్వాములు పోరుమామిళ్ల ప్రతాపరాయుడు, వందవాశి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఇరుముడులు స్వీకరించి పదునెట్టాంబడి ఎక్కి ఆలయంలోని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శబరిమల సన్నిధానానికి తరలివెళ్లారు.

విద్యుత్ చార్జీలు పెంచడం దారుణం



ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచమని హామీనిచ్చి.. ఇప్పుడు పెంచడం దారుణమని సీపీఎం పట్టణ కార్యవర్గ సభ్యుడు పుల్లా నరసింహులు అన్నారు. శనివారం సీపీఎం ఆధ్వర్యంలో విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా పట్టణంలోని ఆత్మకూరు బస్టాండ్ సర్కిల్‌లో ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వినియోగదారులపై ట్రూ ఆఫ్ చార్జీల భారాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చి.. ప్రజలపై భారం మోపుతామంటే సహించేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మాబాషా, ఇంతియాజ్, హరి, సాయికృష్ణ, వంశీ, బాషా, వెంకటేశ్వర్లు, భాను, తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయం



మాట్లాడుతున్న ముస్లిం జేఏసీ నాయకులు

నంద్యాల(వ్యవసాయం): సుప్రీంకోర్టు తీర్పుపై నంద్యాల ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు శనివారం హర్షం వ్యక్తం చేశారు. కమిటీ అధ్యక్షుడు అబులైజ్, జేఏసీ కన్వీనర్ మౌలానా అబ్దుల్లా రషీద్ మాట్లాడుతూ దేశంలోని ఏ మసీదు, మందిరాలపై కోర్టుల్లో విచారణ జరపవద్దని, తీర్పులు, సర్వేలు చేయవద్దని కింది కోర్టులకు సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులను జారీ చేయడం సంతోషకరమన్నారు. ఈ నిర్ణయం వల్ల దేశంలో హిందూ, ముస్లిం మజీద్ మందిర్ వివాదాలకు ఫుల్‌స్టాప్ పడి శాంతిభద్రతలు నియంత్రణలో ఉంటాయన్నారు. మందిర్, మసీదు అంటూ గొడవలు సృష్టించి రాజకీయ లబ్ధి పొందే వారికి ఈ తీర్పు చెంపపెట్టులాంటిదన్నారు. సద్దాంహుసేన్, ఆడిటర్ బాషా, అబ్దుల్ సుభాన్, ఉస్మాన్, జాకీర్, ఫక్రుద్దీన్, మునీర్ అహమ్మద్, ఖాదర్‌బాషా, నూర్‌అహమ్మద్, కమాల్‌బాషా పాల్గొన్నారు.

17న ప్యాపిలిలో జాబ్‌మేళా

ప్యాపిలి: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 17న స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాధికారి శ్రీకాంత్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఐటీఐ, డిప్లమా, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు ధృవీకరణ పత్రాలతో జాబ్‌మేళాకు హాజరు కావాలన్నారు. వివిధ కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఇంటర్వ్యూల ద్వారా ఉద్యోగాలకు ఎంపిక చేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 95426 43747, 79812 38237 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

25 నుంచి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

పాములపాడు: క్రిస్మస్ పండుగ సందర్భంగా చెలిమిళ్ల గ్రామంలో ఈ నెల 25, 26 తేదీల్లో ఉమ్మడి రాష్ట్రస్థాయి పురుషుల కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు సీఎస్ఐ సంఘ పెద్దలు తెలిపారు. విజేతలకు వరుసగా రూ. 30 వేలు, రూ. 20వేలు, రూ. 12 వేలు, రూ. 10 వేలు, రూ. 6 వేలు, రూ.4వేలు అందజేస్తామన్నారు.

శనగకు వేరుకుళ్లు తెగులు

- వెయ్యి ఎకరాల్లో పంట నష్టం
- ఏమి చేయాలో దిక్కుతోచక రైతుల బెంబేలు
- వర్షాలకు నేలవాలిన జొన్న పైరు
- పట్టించుకోని వ్యవసాయ శాఖ అధికారులు




మల్లెవేములలో తెగులు సోకి ఎండిపోతున్న శనగ పైరు,(ఇన్‌సెట్) పసుపు వర్ణంలోకి మారిన శనగ మొక్కలు, వర్షానికి వరిగి పడిపోయిన జొన్న కంకులు

చాగలమర్రి: ప్రభుత్వ సహకారం లేకపోయినప్పటికీ అష్టకష్టాలు పడి పంటలు సాగుచేసిన రైతన్నను తెగుళ్లు వెంటాడుతున్నాయి. ప్రకృతి కూడా సహకరించకపోవడం, భారీ వర్షాల కారణంగా, తెగుళ్ల సోకి పంటలు ఎండిపోతున్నాయి. శనగ, జొన్న పంటలను రక్షించుకోవడానికి ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ తెగుళ్ల అదుపులోకి రావడం లేదు. ఈ సీజన్‌లోనైనా లాభాలు చూస్తామనే ఆశలోనున్న అన్నదాతల ఆశలు పండేలే లేకపోతుండటంపై వారిలో ఆందోళన వ్యక్తమవుతోంది. కష్టసమయంలో అధికారుల సహకారం అందకపోవడంపై ఆక్రోశం వెల్లగక్కుతున్నారు.

జొన్న, శనగ రైతులు కుదేలు..

మండలంలో రబీ సీజన్‌లో శనగ, జొన్న పంటలను రైతులు సుమారు వెయ్యి ఎకరాల చొప్పున సాగు చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఆరుతడి పంటైన శనగకు భూమిలో తేమ శాతం అధికమై వేరుకుళ్ల తెగులు సోకి మొక్క పసుపు వర్ణంలోకి మారి ఎండిపోతోంది. నివారణకు రైతులు వివిధ రకాల క్రిమిసంహారక మందులు పిచికారీ చేసునప్పటికీ ఫలితం కనిపించడం లేదు. దీంతో ఏమి చేయాలో దిక్కుతోచక బెంబేలెత్తిపోతున్నారు. మండలలో అత్యధికంగా మల్లెవేముల, గొట్లూరు, నేలంపాడు తదితర గ్రామాల్లో రైతులు సుమారు 500 ఎకరాల్లో శనగ పంట సాగు చేశారు. పంట సాగుకు ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.30వేల వరకు ఖర్చు చేశారు. తెగుళ్లను అరికట్టేందుకు వివిధ రకాల మందులు పిచికారీ చేసినప్పటికీ అదుపులోకి రాకపోవడంతో పాటు పంట కళ్ల ముందే ఎండిపోతుండటంతో ఏమి చేయాలో అన్నదాతలకు పాలుపోవడం లేదు. అలాగే.. ఇటీవల కురిసిన వర్షాలకు ఆయా గ్రామాల్లో 500 ఎకరాల్లో జొన్న పంట నేలవాలింది. ధాన్యం తడిసి మొలకొలచ్చే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంట ఏపుగా పెరిగి చేతికందే దశలో నేలవాలడంతో భారీగా నష్టం వచ్చే అవకాశముందంటున్నారు.

మా మొర ఆలకించేవారు లేరు



రబీ సీజన్‌లో ఆరుతడి పంటగా శనగ సాగు చేస్తే చీడపీడల బారి నుంచి కాపాడుకోవచ్చని, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి పొందవచ్చని సాగు చేస్తే వేరుకుళ్ల తెగులు సోకి మా ఆశలు అడియాశలయ్యాయి. చీడపీడల నివారణకు చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. అయినా సంబంధిత అధికారులు కనీసం పంటలను పరిశీలించి సలహాలు ఇవ్వలేదు. కేవలం వారి కార్యక్రమాలున్నప్పుడే పొలాల వైపు వస్తారు. ఆ తరువాత ఎక్కడుంటారో తెలియదు. ఇక్కడ మా మొరను ఆలకించేవారు లేరు. ఆదుకునే వారు లేక పంటలు నష్టపోతున్నాం. – శ్రీనివాసరెడ్డి , రైతు మల్లెవేముల గ్రామం

అన్నదాతను ఆదుకునేదెవరు?



జగనన్న ప్రభుత్వంలో ఎరువులు, క్రిమిసంహారక మందుల ధరలు అదుపులో ఉండేవి. ప్రభుత్వం ఆర్‌బీకేల్లో తక్కువ ధరలకు వాటిని అందుబాటులో ఉంచింది. అలాగే.. రైతు భరోసా, పంటల ఉచిత బీమా తదితర సౌకర్యాలతో అండగా నిలిచింది. ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోతే వెంటనే పరిహారం అందించి భరోసానిచ్చింది. ప్రస్తుతం అలాంటి ఆదరణ కరువైంది. ఆపద సమయంలో కూడా పట్టించుకునేవారు లేకపోతే వ్యవసాయ ఎలా చేయగలం. కనీసం దిగుబడులకు మద్దతు ప్రకటించి అమలు చేయలేకపోతున్నారు. తుపానులో తడిసిన దిగుబడులను కొనుగోలు చేసి అండగా నిలిచి ధైర్యం చెప్పాల్సిన ప్రభుత్వం దూరంగా నిలబడి చూడటం సరికాదు. – మల్లారెడ్డి, రైతు, మల్లెవేముల

16 నుంచి ధనుర్మాసం మహోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వర స్వామి

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని సంజీవనగర్ రామాలయంలో శ్రీభగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో ధనుర్మాసం మహోత్సవాలు ఈనెల 16వ తేదీ నుంచి ప్రారంభమవుతున్నట్లు అధ్యక్షుడు సముద్రాల సూరయ్య, శ్రీనివాసులు తెలిపారు. వారు మాట్లాడుతూ ఈనెల 16 నుంచి జనవరి 13వ తేదీ వరకు ప్రతి రోజూ ఉదయం స్వామి వారికి ప్రత్యేక అలంకరణలు, పూజలు నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 7 నుంచి 8గంటల వరకు తిరుమల తిరుపతి దేవస్థానం వ్యాఖ్యాత డాక్టర్ దీవీ హయగ్రీవాచార్యులు తిరుప్పావై ప్రవచనాలు వినిపిస్తారని చెప్పారు. 19న తిరుప్పావడ సేవ, 25న అష్టోత్తర శత కలశాభిషేకం, 26న లక్షతులసీ పూజ, కుడార్కై, 28న ఊంజల సేవ, 10న వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్వామి వారికి విశేషాలంకరణ, ఉత్తర ద్వార దర్శనం, 13న స్వామి, అమ్మవార్ల కల్యాణ మహోత్సవం, 14న ఉదయం మహారథోత్సవం ఉంటుందని వివరించారు.

లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం



కక్షిదారులతో మాట్లాడుతున్న జడ్జి వాసు



కక్షిదారులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి

నంద్యాల(వ్యవసాయం): లోక్ అదాలత్లో కక్షిదారులకు సత్వర న్యాయం లభిస్తుందని మూడవ అదనపు జిల్లా జడ్జి, లోక్ అదాలత్ చైర్మన్ వాసు పేర్కొన్నారు. శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని స్థానిక కోర్టు ఆవరణలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్ కార్యక్రమంలో సీసీ కేసులు 92, సివిల్ కేసులు 41, ఎంసీ 2, డీవీసీ 3, ఎన్‌ఐయాక్ట్ 7, క్రిమినల్ కేసులు 118, ఎక్సైజ్ 16, ఎంవీఓపీ 83 కేసులు చొప్పున మొత్తం 362 కేసులు పరిష్కారం కావడంతో పాటు పలు కేసుల్లో కక్షిదారులకు రూ.8.56 కోట్ల పరిహారం అందజేశామని చెప్పారు. చిన్నచిన్న సమస్యలకు న్యాయస్థానాలను ఆశ్రయించకుండా లోక్ అదాలత్‌కు వెళ్తే సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు. క్షమాపణతో ఎంత పెద్ద గొడవైనా సద్దుమణుగుతుందన్నారు. ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి రాధారాణి మట్లాడుతూ రాజీ కాగల పరిష్కారం కోసం న్యాయవాదులు, పోలీసులు కృషి చేస్తున్నారన్నారు. రెండవ అదనపు సీనియర్ సివిల్ జడ్జి కిరణ్ మాట్లాడుతూ కుటుంబ కలహాల వల్ల భార్యాభర్తలు కోర్టును ఆశ్రయిస్తే పిల్లల భవిష్యత్ దెబ్బ తింటుందన్నారు. రాజీయే రాజ మార్గమనేది తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏజీపీ జగన్‌మోహన్‌రెడ్డి, వివేకానందరెడ్డి, పీపీ శ్రీనివాసులు, రావినూతల దుర్గాప్రసాద్, భూపని వెంకటేశ్వర్లు, అడ్డగాళ్ల వెంకటేశ్వర్లు, ఓబుల్ రెడ్డి, చంద్రశేఖర్ తదితర సీనియర్, జూనియర్ లోక్‌అదాలత్ సిబ్బంది రామచంద్రారెడ్డి, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

రాజీమార్గమే రాజమార్గం

ఆళ్లగడ్డ: ఎలాంటి సమస్యలైన రాజీ మార్గం ద్వారా సకాలంలో పరిష్కరించుకోవచ్చనని ఆళ్లగడ్డ ఐదవ అదనపు జిల్లా న్యాయమూర్తి మురళీకృష్ణ అన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఇందులో 238 కేసులు పరిష్కారమయ్యాయి. రూ 10.48 లక్షలు కక్షిదారులకు అందజేశారు. సీనియర్ సివిల్ జడ్జి శైలజ ఉన్నారు.

మహానందిలో వీకెండ్ సందడి



మహానందీశ్వరుడి దర్శనార్థం క్యూలైన్లలో వస్తున్న భక్తజనం

మహానంది: మహానందిలో శనివారం వీకెండ్ సందర్భంగా భక్తజన సందడి నెలకొంది. ఈ మేరకు వేలాది సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. వేకువజామున నుంచి ప్రారంభమైన శ్రీ కామేశ్వరీదేవి సహిత శ్రీ మహానందీశ్వరస్వామి వార్ల దర్శనం రాత్రి వరకు నిర్విరామంగా కొనసాగింది. భక్తులు స్థానిక కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి, అమ్మవార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. అలాగే.. మహానందీశ్వరుడి దంపతులకు శనివారం నిత్య కల్యాణోత్సవంలో భాగంగా ఉదయం కల్యాణోత్సవం కన్నులపండువగా సాగింది.భక్తులు స్వామి, అమ్మవారి కల్యాణోత్సవాన్ని కనులారా తిలకించారు. కల్యాణం అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

భక్తిశ్రద్ధలతో కాశిరెడ్డినాయన ఆరాధన




ప్రత్యేక అలంకరణలో కాశిరెడ్డినాయన, గుట్టకొండ లక్ష్మీనరసింహస్వామిని అభిషేకిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని కల్పనా సెంటర్‌లో వెలసిన కాశిరెడ్డినాయన ఆశ్రమంలో కాశినాయన 29వ ఆరాధనోత్సవాన్ని శనివారం సాయంత్రం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కాశినాయన ఉత్సవ మూర్తికి పంచామృతాభిషేకాలు, విశేష పూజలు చేపట్టి పట్టువస్త్రాలతో అలంకరించారు. అనంతరం సామూహిక విష్ణుసహస్ర నామావళి, కుంకుమార్చనలు జరిపించారు. మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆశ్రమ నిర్వాహకులు డాక్టర్ గోపాల్‌రెడ్డి, చక్రపాణి, ఈశ్వరరెడ్డి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

రుద్రవరం: మండల కేంద్రానికి సమీపాన నల్లమల అటవీ ప్రాంతంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం ప్రాంగణంలో వెలసిన కాశిరెడ్డి నాయన ఆలయంలో శనివారం ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో వేదపండితులు ఉదయాన్నే ముందుగా లక్ష్మీనరసింహ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. పూజా కార్యక్రమాలు ముగిశాక పక్కనే కొలువైన కాశిరెడ్డి నాయనకు విశేష పూజలు చేపట్టారు. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తాదులతో హోమాది పూజా కార్యక్రమాలు జరిపించారు.

జూనియర్ కబడ్డీ క్రీడాకారుల ఎంపిక పోటీలు



ఎంపికైన క్రీడాకారులు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని శ్రీవెంకటేశ్వర విద్యామందిర్ క్రీడా మైదానంలో శనివారం ఉమ్మడి జిల్లా కబడ్డీ బాలురు, బాలికల జూనియర్ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ఉమ్మడి జిల్లాల కబడ్డీ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ ఏపీ రెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వెంకటేశ్వర విద్యామందిర్ కరస్పాండెంట్ వెంకటరాముడు, శాంతినికేతన్ విద్యాసంస్థల చైర్మన్ సుధాకర్ పోటీలను ప్రారంభించారు.ఆంధ్రప్రదేశ్ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నిమ్మకాయల సుధాకర్, ఎంఈఓ సుబ్రహ్మణ్యం, క్రీడా భారతి వైస్ ప్రెసిడెంట్ జ్యోత్స్న మాట్లాడారు. మొత్తం 22 మంది బాలురు, 25 మంది బాలికలను ఎంపిక చేశామని దండెనాగరాజు తెలిపారు. కార్యక్రమంలో కాశిరెడ్డినాయన ఆశ్రమ కమ్యూనిటీ సెక్రటరీ శంకర్‌రెడ్డి, మహేశ్వరి, వ్యాయామ ఉపాధ్యాయులు, 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా సాగునీటి సంఘాల ఎన్నికలు

- నేతలు చెప్పిన పేర్లు రాసి ఎన్నికల్లో గెలుపొందినట్లు ధ్రువ పత్రాల అందజేత
- కొన్ని చోట్ల పోటీచేసే అభ్యర్థులు రాకుండానే ఎన్నికైనట్లు ప్రకటన
- ఎన్నికల నియమావాళిని పట్టించుకోని అధికారులు



ఓబులంపల్లెలో పోటీ చేసే వారు, ఓటర్లు లేక వెలవెల బోతున్న పోలింగ్ కేంద్రాలు



దీబగుంట్లలో ఎన్నికైన టీసీలతో పాటు అధ్యక్ష, ఉపాధ్యక్షులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న దృశ్యం



ఉయ్యాలవాడలో రిటర్నింగ్ అధికారి నుంచి ధ్రువ పత్రాలు అందుకుంటున్న అభ్యర్థులు

ఆళ్లగడ్డ: సాగునీటి సంఘాల ఎన్నికలను ప్రజా ప్రతినిధులు, అధికారులు కలిసి కాలరాశారు. నియోజకవర్గంలో సాగునీటి సంఘాల ఎన్నికల్లో ప్రజాస్వామ్యం అపహాస్యం పాలైంది. అధికార పార్టీ నేతలకు అన్ని శాఖల్లోని అధికార యంత్రాంగం సహకరించడంతో ఎన్నికలు రాజ్యాంగ బద్ధంగా కాకుండా చెప్పింది రాసుకో.. గెలిచినట్లు ఇచ్చుకో.. అన్న అన్న చందంగా సాగింది. అధికారులు ఎన్నికల నిబంధనల గురించి నామమాత్రం పట్టించుకోక పోవడం విమర్శలకు తావిచ్చింది. ఓటర్లు అందరిని సమావేశ పరిచి ఎంపిక ప్రక్రియ నిర్వహించాలని ఆదేశాలు ఉన్నాయి. నిజకవర్గంలో 789 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా ఇందులో ఒక్కో కేంద్రంలో ఇద్దరు పోలింగ్ అధికారులను కేటాయించారు. వీరిపై పర్యవేక్షణకు పదుల సంఖ్యలో ఎన్నికల అబ్జర్వర్లను కేటాయించారు. నిబంధనల మేరకు ఉదయం 8 నుంచి 9 గంటల వరకు టీసీ మెంబర్స్ సాధారణ సర్వసభ్య సమావేశం సమావేశం నిర్వహించాలి. అనంతరం ఆసక్తి ఉన్న వారితో నామినేషన్ పత్రాలు తీసుకుని ఓటర్లతో ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులను ఎన్నుకోవాలి. పోటీలో ఎవరూ లేకుంటే ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించి ధ్రువ పత్రాలు అందజేయాలి. ఎన్నికైన అభ్యర్థుల జాబితాను ఎన్నికల కార్యాలయంలో ప్రకటించాలి. సాయంత్రం వీరందరిని సమావేశపరిచి అధ్యక్షుడు, ఉపాధ్యక్షులను ఎన్నుకోవాలి. అయితే ఈ నిబంధనలను ఏమాత్రం పట్టించుకోలేదు. ఆయా పోలింగ్ కేంద్రాల్లోని అధికారులందరూ ఒకే చోట కూర్చుని నేతలు ఎవరి పేర్లు చెబితే వారి పేర్లు రాసి గెలుపొందినట్లు ధ్రు పత్రాలు అందజేసి మమ అనిపించారు. ఓటర్లు వచ్చినా రాకపోయిన గడువు వరకు పోలింగ్ కేంద్రాల్లో ఉండాల్సిన అధికారులు కొన్ని చోట్ల 10 నుంచి 20 నిమిషాల్లో ముగించడం విశేషం. అనేక చోట్ల అసలు టీసీ మెంబర్ రాకపోయినా ఇష్టమైన వారి పేరు రాయించి గెలుపొందినట్లు పత్రాలు తీసుకున్నారన్న ఆరోపణలున్నాయి.

ఆరు సాగునీటి సంఘాలు ఏకగ్రీవం

గోస్పాడు: మండలంలోని ఆరు నీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా జరిగినట్లు తహసీల్దార్ షేక్ మొహిద్దీన్ తెలిపారు. దీబగుంట్ల 27వ నీటి సంఘం అధ్యక్షుడిగా పామిరెడ్డిగారి చిన్ననాగిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా శివకిరణ్‌రెడ్డి, 26వ నీటి సంఘం అధ్యక్షుడిగా సుదర్శన్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా రామేశ్వరరెడ్డి, 24వ నీటి సంఘం అధ్యక్షుడిగా తేళ్లపురి కాటంరెడ్డి తులసీశ్వరరెడ్డి, ఉపాధ్యక్షుడిగా రామసుబ్బయ్య, 31వ నీటి సంఘం గోస్పాడు అధ్యక్షుడిగా చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా విశ్వనాథరెడ్డి, 32వ నీటి సంఘం అధ్యక్షుడిగా సుబ్బారావు, ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్వరరావు, 36వ నీటి సంఘం అధ్యక్షుడిగా విష్ణువర్ధన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా గంగుల సుధాకర్‌రెడ్డి ఎన్నికైనట్లు ఆయా గ్రామాలకు చెందిన ఎన్నికల అధికారులు ధ్రువీకరించినట్లు తహసీల్దార్ వివరించారు. ఎస్ఐ వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

తొమ్మిది సంఘాలు ఏకగ్రీవం..

ఉయ్యాలవాడ : మండలంలో 9 సాగు నీటి సంఘాలకు శనివారం ఎన్నికలు నిర్వహించారు. అన్ని సంఘాల పరిధిలోని డబ్ల్యూఏ(టీసీ) సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రూపనగుడి చెరువుకు చైర్మన్‌గా కర్నాటి మహేశ్వరరెడ్డి, వైస్ చైర్మన్‌గా భీమునిపాటి ఉశేని, తుడుమలదిన్నె చెరువుకు పేరెడ్డి శివరామిరెడ్డి, కైపా రామనాథ్‌రెడ్డిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే ఎస్సార్బీసీ పరిధిలో మాయలూరు 47వ సంఘం చైర్మన్‌గా అనంత రామసుబ్బారెడ్డి, వైస్ చైర్మన్‌గా కొర్రపాటి భాస్కర్‌రెడ్డి, 48 అల్లూరు చైర్మన్‌గా బోరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా గాండ్ల సుబ్బరాయుడు, 49 మాయలూరు చైర్మన్‌గా పేరెడ్డి రామసుబ్బారెడ్డి, వైస్ చైర్మన్‌గా కొర్రపాటి ప్రభాకర్‌రెడ్డి, కెసి కాలువ పరిధిలోని 42 హరివరం చైర్మన్‌గా గండా రాఘవేంద్ర మహేశ్వరరెడ్డి, వైస్ చైర్మన్‌గా అంబటి వీరశేఖర్‌రెడ్డి, 43 ఉయ్యాలవాడ చైర్మన్ ఆకుల వెంకటసుబ్బయ్య, వైస్ చైర్మన్ మిరపల్లె వెంకటేశ్వర్లు, 49 పెద్దయమ్మనూరు చైర్మన్‌గా కసాని నరసింహారెడ్డి, వైస్ చైర్మన్‌గా కర్నాటి మేఘనాథ్‌రెడ్డి, 52 పెద్దయమ్మనూరు చైర్మన్ కర్రా రాజేశ్వరరెడ్డి, వైఎస్‌చైర్మన్‌గా తరిగోపుల శివశంకర్‌రెడ్డిని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి ప్రసాద్ రెడ్డి వివరించారు.

శిరివెళ్ల: మండలంలో 4 చెరువులు, 3 కేసీ కెనాల్, 3 తెలుగుగంగ కాల్వల సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరగగా టీడీపీ మద్దతుదారులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గంగవరం దొర్పి చెరువు నీటి సంఘం అధ్యక్షుడిగా చెన్నారెడ్డిగారి జనార్దన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా వెంకటనారాయణ ఎన్నికయ్యారు. అలాగే చెన్నూరు చెరువు సంఘం ప్రెసిడెంట్‌గా కుమ్మరి వీరభద్రుడు, శిరివెళ్ల నాగుల చెరువు నీటి సంఘం అధ్యక్షుడిగా సూరా రామా, ఉపాధ్యక్షుడిగా ఓబులేసు, బోయల కుంట్లలో రంగరాజు చెరువు అధ్యక్షుడిగా ఈడిగ గోవిందు, వైస్ ప్రెసిడెంట్‌గా సంగిరెడ్డి భాస్కరరెడ్డి, తెలుగు గంగ 21వ సాగునీటి సంఘం ప్రెసిడెంట్‌గా చెన్నారెడ్డిగారి సంజీవకుమార్‌రెడ్డి, 19వ సాగునీటి సంఘం ప్రెసిడెంట్‌గా చెన్నారెడ్డిగారి అశోక్‌కుమార్‌రెడ్డి, 22వ సంఘం ప్రెసిడెంట్‌గా యామా చిన్నమ్మ, 28వ కేసీ కెనాల్ నీటి సంఘం అధ్యక్షుడుగా సంగిరెడ్డి నాగేశ్వర రెడ్డి, 29వ కేసీ కెనాల్ నీటి సంఘం ప్రెసిడెంట్‌గా కమతం లక్ష్మీరెడ్డి, 30వ సంఘం ప్రెసిడెంట్‌గా చిలుకల రాంపుల్లయ్య ఎన్నికయ్యారు. సీఐ వంశీధర్, ఎస్ఐ చిన్న పీరయ్య పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు

శిరివెళ్ల: మండలంలో శనివారం జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికలపై మండల జనసేన నాయకులు, కార్యకర్తలు మండిపడ్డారు. పోటీకి కావాల్సిన నో– డ్యూస్ సర్టిఫికెట్లు అధికారులు ఇవ్వకపోవడంతో పోటీ చేసేందుకు కార్యకర్తలు దూరమయ్యారు. నాగుల చెరువు, కేసీ కెనాల్, తెలుగు గంగ కాల్వల సాగునీటి సంఘాలకు తమ అభ్యర్థులు నిల్వాలని కొద్ది రోజులుగా ఆ పార్టీ నాయకులు సిద్ధమయ్యారు. అభ్యర్థుల నీటి పన్ను చెల్లిస్తామని 5 రోజులుగా అధికారుల చుట్టు తిరిగినా ఇంకా తమకు అనుమతి రాలేదని, ఆన్‌లైన్‌లో చెల్లించమని అధికారులు చెబుతూ వచ్చారు. ఈ నెల 13వ తేదీ రాత్రి వరకు పన్ను కట్టించుకోకుండా నో డ్యూస్ సర్టిఫికెట్ ఇవ్వలేదు. శనివారం ఉదయం నామినేషన్లుకు వెళ్లగా నో– డ్యూస్ సర్టిఫికెట్లు ఉన్న వారిని మాత్రమే పోలింగ్ కేంద్రంలోకి పోలీసులు అనుమతించారు. దీంతో కార్యకర్తలు తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. జరిగిన విషయాన్ని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. జనసేన నాయకులు మండల పసుల నరేంద్ర, పెసరాయి చాంద్‌బాషా, ఖాద్రి తదితరులు మాట్లాడుతూ ఏక పక్షంగా ఎన్నికలు జరిగాయని ఆరోపించారు.

నంద్యాల(అర్బన్): మండలంలోని నాలుగు సాగునీటి సంఘాలకు జరిగిన ఎన్నికల్లో ఏకగ్రీవాలకు పెద్దపీట వేశారు. అధికార పార్టీ నాయకుల హవాతో మండలంలోని నూనెపల్లె, కొత్తపల్లి, మిట్నాల, చాపిరేవుల గ్రామాల సాగునీటి సంఘాల అధ్యక్షుల ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. నూనెపల్లె సాగునీటి సంఘం అధ్యక్షులుగా తిమ్మయ్య, మిట్నాల రవిబాబు, చాపిరేవుల వెంకటలక్ష్మమ్మ, కొత్తపల్లి సాగునీటి సంఘం అధ్యక్షులుగా బొమ్మిరెడ్డి సుబ్బారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

రాష్ట్రాల హక్కులు హరిస్తున్న కేంద్రం



నంద్యాలలో నిరసన తెలుపుతున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రాలకు ఇవ్వాల్సిన నిధులను, వాటాలను ఇవ్వకుండా, సంక్షేమ పథకాల నిధుల్లో కోత విధించి దుర్మార్గమైన విధానాలను అనుసరిస్తుందని ఏపీ రైతు సంఘం, సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు విమర్శించారు. రాష్ట్రాల హక్కులను కాపాడాలంటూ ఆయా సంఘాల ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, రైతు సంఘం కార్యదర్శి రాజశేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు నరసింహలు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తమకు అనుకూలమైన ప్రభుత్వాలకు మాత్రమే నిధులను కేటాయిస్తూ వ్యతిరేక ప్రభుత్వాలను విస్మరిస్తూ రాష్ట్ర హక్కులను హరిస్తుందన్నారు. దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిన కేరళలో సీపీఎం లెఫ్ట్ పాలిస్తుండటంతో అందజేయాల్సిన నిధులను విడుదల చేయడం లేదన్నారు. బాలవెంకట్, వెంకటలింగం, రత్నమయ్య, రామయ్య, రామకృష్ణ, మద్దిలేటి, లక్ష్మణ్, రామేశ్వరరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వైభవం.. దత్తాత్రేయుడి రథోత్సవం



దత్తాత్రేయ స్వామి రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): దత్త జయంతిని పురస్కరించుకొని స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్దనున్న జంబులాపరమేశ్వరి దేవాలయంలో వెలసిన శ్రీ షిర్డి సాయిబాబా దేవస్థానం నుంచి దత్తాత్రేయ చిత్రపటాన్ని ప్రత్యేకంగా అలంకరించిన రథంలో ఉంచి పురవీధుల్లో ఊరేగించారు. రథోత్సవం ఆలయం నుంచి మెయిన్ బజార్, గాంధీచౌక్, నాగులకుంట రోడ్డు, శ్రీనివాసనగర్, సంజీవనగర్ మీదుగా కొనసాగింది. ఈ సందర్భంగా భక్తులు దత్తాత్రేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉమామహేశ్వరి మహిళా మండలి సభ్యులు యాడికి శ్రీదేవి, ఆలయ నిర్వాహకులు ఉమామహేశ్వరమ్మ, ఎల్లాస్వామి పాల్గొన్నారు.